నెలాఖరులోగా పాఠశాలలకు యూనిఫాం అందించాలి

కథలాపూర్, జూలై 10: ఈ నెలాఖరులోగా పాఠశాలలకు యూనిఫాం అందించాలని ఏపీఎం నరహరి తెలిపారు. మొదటి విడత కింద 4051 మంది విద్యార్థులకు యూనిఫాం అందించినందు వల్ల రెండోవిడత పూర్తి చేయాలని సూచించారు. సిరికొండ, దుంపెట, అంబారిపేట, పోతారం గ్రామాల్లోని సుమారు 45 మంది మహిళలు యూనిఫాం కుట్టే పనుల్లో బిజీగా ఉన్నారని ఏపీఎం తెలిపారు. ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా పాఠశాలలకు యూనిఫాం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

- ప్రధానమంత్రి మత్స్య యోజనపై మత్స్యకారుల ఆశలు
- కొత్తగా నమోదుకు చర్యలు
- చెల్లింపుల్లో నూతన నిబంధనలు
- ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి
- పాన్ కార్డు...ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి
- జిల్లాలో ఎనిమిదివేలకు పైగా మత్స్యకారులకు అందనున్న ప్రయోజనం



బీమాతో మత్స్యకారుల్లో ధీమా

జగిత్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి మత్స్య యోజన బీమా పథకంతో కార్మికుల్లో ధీమా నెలకొంటోంది. పథకం కింద అందే పరిహారంలో ప్రస్తుత యేడాది కొత్త మార్పు లు చోటుచేసుకున్నాయి. ఈ కొత్త నిబంధనలు ఈ నెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లు సమాచారం. పరిహారం చెల్లింపుల్లో వచ్చిన కొత్త నిబంధనలతో మత్స్యకా రులకు చిక్కులు తప్పేలాలేవు. గతంలో మృతి చెందిన మత్స్యకారుడికి పరిహారం చెల్లింపులో సంఘం సభ్యత్వాన్ని పరిగణలోకి తీసుకొని ఎలాంటి నిబంధనలు లేకుండా నేరుగా చెల్లింపులు చేసేవారు. ప్రస్తుతం మారిన నిబంధనలు ప్రకారం మృతి చెందిన మత్స్యకారుడికి బీమా యోజన పరిహారం అందాలంటే తప్పనిసరిగా పాన్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఉండాలనే నిబంధన విధించారు. ప్రమాదవశాత్తు మరణించినా, గాయపడినా, మత్స్యశాఖ నుంచి వచ్చే పరిహారం పొందడానికి ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలు పాటించాలని ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లాలోని మత్స్యకారులు పాన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు.

● 230 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు..

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 230 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 15,552 మంది సభ్యులున్నారు. ఇందులో 47 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 1,953 మంది మహిళలు, 182 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 13,599 మంది పురుష మత్స్య కారులు సభ్యులుగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ చెరువులకు 3,174 హెక్టార్ల విస్తీర్ణం, డిపార్ట్‌మెంట్ చెరువులకు 15,162 హెక్టార్ల విస్తీర్ణం ఉంది.

● మారిన నిబంధనలు...

మత్స్యకారులకు ప్రమాద బీమా యోజన బాగానే ఉన్నా మారిన కొత్త నిబంధనలు, మార్గదర్శకాలు చాలా కఠినంగా ఉండడంతో ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న సభ్యులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ప్రస్తుతం పాన్‌కార్డులు పొందడానికి ఉన్న నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుడు తప్పనిసరిగా చేతిరాతతో సంతకం చేయాల్సి ఉంది. సంతకం లేకుంటే పాన్‌కార్డు జారీ చేయడం కుదరదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. మత్స్యకారులు చాలా మంది నిరక్షరాస్యులు ఉండడంతో పాన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీంతో వారు బీమా పరిధిలోకి వచ్చే అవకాశాలు లేవు. దీనిని సవరించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

● లబ్ధి పొందేదిలా...

మత్సకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న ప్రతీఒక్కరు ప్రధా నమంత్రి మత్స్య యోజన బీమా పథకం కింద పరిహారం పొందడానికి అర్హులుగా పరిగణించ బడుతుంటారు. మత్స్యకారుల బీమా ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. ఈ పథకంలో అర్హులుగా గుర్తించిన ఏ సభ్యు డైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఐదు లక్షల రూపాయలు, అంగవైకల్యం సంభవిస్తే రూ. 2.5 లక్షలు, ప్రమాదం జరిగితే 25 వేల రూపాయల పరిహారం అందే విధంగా మార్గదర్శకాలు రూపొందించారు. ప్రమా దంలో చనిపోతే గతంలో పాన్‌కార్డు లేకుండానే పరిహారం సొమ్ములు అందేవి. మారిన కొత్త నిబంధనలు ప్రకారం తప్పనిసరిగా సభ్యుడు పేరున పాన్‌కార్డు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీమా సౌకర్యాలు పొందడానికి ఆయా సంఘాల్లో సభ్యత్వ కార్డు ఉన్న మత్స్యకారులు వ్యక్తిగత ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలు, పాన్‌కార్డు, ఇతర ధ్రువపత్రాలతో పాటు ఫోన్ నంబర్‌తో జీఏఐఎస్ సైట్‌లో నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో గల మత్స్యకార సహ కార సంఘాల పరిధిలో సుమారు ఎనిమిదివేల మంది పథకం కింద అర్హులుగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. వీరితో పాటు మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాల్లో సైతం పలువురు సభ్యులు ఉన్నారు. వీరందరికి పీఎం మత్స్య యోజన కింద లబ్ధి పొందడానికి అర్హత ఉంటుంది. మారిన నూతన నిబంధనల ప్రకారం బీమా పరిహారం కోసం కొత్తగా వీరందరు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అవగాహన కల్పిస్తాం...

- శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి, జగిత్యాల



ప్రధానమంత్రి మత్స్య యోజన బీమా పొందడానికి మారిన నిబంధనల ప్రకారం ప్రతీసభ్యుడి వద్ద పాన్‌కార్డు ఉండాలనే నిబంధనలు తప్పనిసరిగా మారింది. బీమా కోసం పాన్‌కార్డు కలిగి ఉండాలని ఉంది. దీనిపై జిల్లా మత్స్య కార్మిక సంఘం అవగాహన కల్పిస్తాం. దీనిపై ఎలాంటి అపోహలకు పోకుండా గతంలో మాదిరిగానే దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నిబంధనలు అమల్లోకి వచ్చిన తరువాత జిల్లాలోని మత్స్యసహకార సంఘాల సభ్యులకు సమాచారం ఇచ్చాం.

జిల్లాలో 18 మంది ఎస్ఐల బదిలీలు



జగిత్యాల టౌన్, జూలై 10: జిల్లాలో పనిచేస్తున్న 18 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీబీలో పనిచేస్తున్న అశోక్‌ను రాయికల్ ఎస్ఐగా, రాయికల్‌లో పనిచేస్తున్న అజేయ్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. పెగడపల్లి ఎస్ఐగా పనిచేస్తున్న రామకృష్ణను సీసీఎస్‌కు, ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ ఎస్ఐగా పనిచేస్తున్న రవి కిరణ్‌ను పెగడపల్లికి, ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ ఎస్‌గా పనిచేస్తున్న ఇమ్రాన్ సయ్యద్‌ను జగిత్యాల టౌన్ వన్ ఎస్సైగా బదిలీ చేశారు. బీర్‌పూర్ ఎస్ఐగా పనిచేస్తున్న గౌతం పవార్‌ను వీఆర్‌కు, మల్యాల రెండో ఎస్ఐగా పనిచేస్తున్న కుమారస్వామిని బీర్‌పూర్‌కు, ఆదిలాబాద్ జిల్లా గడిగూడ ఎస్ఐగా పనిచేస్తున్న గంగుల మహేష్‌ను జగిత్యాల టౌన్ రెండో ఎస్‌గా, నిర్మల్ జిల్లా భైంసా టౌన్ రెండో ఎస్సైగా పనిచేస్తున్న మహ్మద్ షరీఫ్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. జగిత్యాల టౌన్ రెండో ఎస్ఐగా పనిచేస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డిని ధర్మపురి రెండో ఎస్ఐగా, వీఆర్‌లో ఉన్న సుధీర్‌రావును మల్యాల రెండో ఎస్సైగా, సీసీఎస్‌లో ఉన్న దత్తాత్రిని సారంగపూర్ ఎస్ఐగా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న రాజును మెట్‌పెల్లి రెండో ఎస్ఐగా, జగిత్యాల టౌన్ వన్ ఎస్ఐగా ఉన్న నరేష్‌కుమార్‌ను మల్యాల వన్ ఎస్సైగా, మల్యాల వన్ ఎస్ఐగా ఉన్న అబ్దుల్ రహీంను డీఎస్‌బీకి బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న గీతను డీసీఆర్‌బీకి, సారంగాపూర్‌లో పనిచేస్తున్న తిరుపతిని వీఆర్‌కు, వీఆర్‌లో ఉండి కోరుట్ల పోలీస్‌స్టేషను అటాచ్డ్ ఉండి ఎస్సైగా పనిచేస్తున్న మహ్మద్ ఆరీఫొద్దీన్‌ను పీసీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

వనమహోత్సవంలో

ప్రజలను భాగస్వాములు చేయాలి

- ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ రఘువరన్ 6



బండలింగాపూర్‌లో మొక్కకు నీరు పోస్తున్న రఘువరన్

నిర్మించారు... వదిలేశారు

- నిరుపయోగంగా వ్యవసాయ శాఖ, స్త్రీశక్తి భవనాలు 5
- అధికారులు, సిబ్బందికి తప్పని ఇబ్బందులు

పోలీసుల విస్తృత తనిఖీలు

జగిత్యాల టౌన్, జూలై 10: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తా, యావర్ రోడ్ తదితర ప్రాంతాల్లో టౌన్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహన యజమానులకు జరిమానాలు విధించారు. నంబర్ ప్లేట్లు లేని 25 వాహనాలను సీజ్ చేశారు. ఎస్సై నరేష్ తదితరులు ఉన్నారు.

ధర్మపురి కోర్టు ఇన్‌చార్జి ఏజీపీగా రౌతు రాజేష్



ధర్మపురి, జూలై 10: ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి ఏజీపీ(అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్)గా న్యాయవాది రౌతు రాజేష్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆయనకు బుధవారం నియామకపు ఉత్తర్వులు అందించారు. బుగ్గారం మండలంలోని శెకెల్ల గ్రామానికి చెందిన న్యాయవాది రాజేష్ 13 ఏళ్లుగా జగిత్యాల, ధర్మపురి కోర్టుల్లో న్యాయవాదిగా పని చేస్తున్నారు. గతంలో ఆయన సర్పంచ్‌గా కూడా పని చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనను శాలువా కప్పి సన్మానించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు.

దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేపట్టాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మేడిపల్లిలోని సత్యసాగర్ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి రూరల్, జూలై 10: గ్రామాల్లో దెబ్బతిన్న చెరువులు, కాలువలకు మరమ్మతులు త్వరగా చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అధికారులకు సూచించారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలోని సత్యసాగర్, పెద్దచెరువులను బుధవారం పరిశీలించారు. గ్రామంలోని చెరువుల కట్టలను, తూము పరిశీలించి మాజీ సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డితో పాటు ఇరిగేషన్ డీఈ అరుణోదయ్‌కుమార్, అధికారులతో కలిసి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కురుస్తున్న వర్షపు నీరు చెరువుల్లోనే ఉండేలా చూడాలని, నీటి నిల్వలతో భూగర్భజలాలు పెరిగి రైతులకు లబ్ధి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దెబ్బతిన్న తూములు, కాలువలు, గండిపడిన చెరువుల మరమ్మతులు త్వరగా చేపట్టాలని పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి మేధోశక్తిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే నేరుగా తెలిపాలని సూచించారు. ఈయన వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, యాళ్ల తిరుపతిరెడ్డి, నాయకులు, అధికారులు, తదితరులు ఉన్నారు.

● కల్లూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే..

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ గ్రామంలోని మాటు కాల్వను మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, ఇరిగేషన్ అధికారులతో కలిసి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పరిశీలించారు. గ్రామ శివారులోని పెద్ద వాగు గతంలో నిర్మాణం చేసిన మాటు కాల్వను పరిశీలించి దాని అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మాటు కాల్వ నుంచి చెరువులో చేరే నీటి సరఫరా వివరాలను తెలుసుకొని మరింత అభివృద్ధికి ప్రభుత్వ నిధులు కేటాయించే విధంగా చొరవ చూపుతానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, ఇరిగేషన్ ఏఈ సిరాజ్, సింగిల్ విండో ఛైర్మన్ అదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ప్రమాదబీమా చెక్కు అందజేత..

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారు కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కును కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. బుధవారం పట్టణంలోని గాయత్రి బ్యాంకులోని ఖాతాదారుడు అందే గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బ్యాంకు కల్పించిన ఇన్సూరెన్స్ లక్ష రూపాయల విలువైన చెక్కును కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినియోగదారులకు బీమా సౌకర్యం కల్పించి అందించినందుకు బ్యాంక్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, గుంతి దేవేందర్, నోముల లక్ష్మారెడ్డి, దశరథ్‌రెడ్డి, డబ్బా నర్సన్న, బ్యాంకు మేనేజర్ కేశ శివకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఎమ్మెల్యే



మెట్‌పల్లి మైనార్టీ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పి ఆకట్టుకున్నారు. బుధవారం మెట్‌పల్లి పట్టణ శివారులోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమంది విద్యార్థులు గురుకులానికి రావడం లేదని, రాకపోవడానికి గల కారణాలను ప్రిన్సిపాల్ తిరుపతిని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ గదులు, భోజనశాల, తరగతి గదులు పరిశీలించిన అనంతరం విద్యార్థులను చూసి ఆయన టీచర్‌గా మారి ఇంగ్లీష్ పాఠాన్ని బోధించారు. తర్వాత విద్యార్థులను ప్రశ్నలు అడిగి పాఠాలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను విడిచి హాస్టల్లో ఉండి చదువుకుంటున్నందుకు వారి ఆశయాలకు అనుగుణంగా ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థి వెనుకబడిన సబ్జెక్టులో టీచర్లను అడిగి నివృత్తి చేసుకుంటూ చదువుల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి జీవితాలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈయన వెంటా మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు, తదితరులు ఉన్నారు.

ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తాం

బుగ్గారం జూలై 10: సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని ధర్మపురి సీఐ నర్సింహారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుగ్గారం మండల కేంద్రంలోని బుగ్గారం ఎక్స్‌రోడ్డు వద్ద స్థానిక ఎస్సై శ్రీధర్‌రెడ్డితో కలిసి బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోద చేయడంతో పాటు 13 మంది వాహనదారులకు సరైన పత్రాలు లేకపోవడంతో జరిమానా వితిధించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడుపవద్దని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్‌రెడ్డి, ఏఎస్ఐ లక్ష్మీనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మత్స్యకారుల దినోత్సవం

మల్లాపూర్, జూలై, 10: మండలంలోని వేంపల్లిలో జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. బుధవారం గ్రామంలోని గంగపుత్రులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం చేపలు పట్టే పరికారలను ఒక్క చోట ఏర్పాటు చేసి వేడుకలను జరుపుకున్నారు. మత్స్యకారుల ఐక్యత కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు రొడ్డ రాజు, గంగారాం, గంగరాజాం, గంగాధర్, లక్ష్మీనారాయణ, ధర్మేందర్, రిశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

మీసేవా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సంపత్‌రావు

జగిత్యాలరూరల్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇందిరా మహిళా శక్తి మీసేవా కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి జిల్లాలో జగిత్యాల జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సంపత్‌రావు అన్నారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని మోతె, హస్నాబాద్, ధర్మారం గ్రామాల్లోని ఆయా గ్రామపంచాయతీ భవనాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ మహిళ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని తెలిపారు. మహిళసంఘాల సభ్యులకు మీసేవా కేంద్రాల్లో అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లాలో 22 మహిళ మీసేవా కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు కోసం అనుమతి కల్పించిందని పేర్కొన్నారు. అనంతరం హస్నాబాద్, మోతె గ్రామాల్లో వనమహోత్స వంలో భాగంగా డీఆర్డీవో మొక్కలు నాటారు. జాబితాపూర్‌లో మహిళ సంఘ సభ్యురాలు నిర్వహిస్తున్న హోం ఫుడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఏపీఎం ఓదెల గంగాధర్, ఏపీవోలు దయాకర్, గంగాలక్ష్మణ్, జీపీ కార్యదర్శులు ప్రమోద్, కృష్ణ, చైతన్య, రంజిత్, సీసీలు విద్యాసాగర్, మరియా వీవోఏలు మాధవి, రజిత, మమత, జయలక్ష్మి, వీవో అధ్యక్షురాళ్లు విజయ, లత, లక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.



మోతె గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో సంపత్‌రావు

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 10: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు చదువు దూరమైపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి నిరసన తెలిపారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 326 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వారందరికి విద్యను బోధించేందుకు ఐదుగురు ఉపాధ్యాయుల మాత్రమే పని చేస్తున్నారని ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటినుంచి ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు నియమించకపోవడంతో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువుకు దూరమైపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మా పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించి మా పిల్లలకు చదువులను నేర్పించాలంటూ పిల్లల తల్లిదండ్రులు బుధవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అక్కడి చేరుకుని ధర్నా చేస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నాయని బదిలీలు ముగిసిన వెంటనే మీ పాఠశాలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ధర్నాను విరమించారు.



సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకొని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

వేములవాడ టౌన్, జూలై 10: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన బొమ్మళ లక్ష్మి అనే మహిళ వద్ద ఉన్న ప్లాట్‌ను అక్రమంగా తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేసి రౌడీ షీట్ ఓపెన్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వివరాల ప్రకారం అనుపురం గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ తిప్పాపూర్ గ్రామంలో ప్లాట్‌ను విక్రయించి తన కూతురు వివాహం చేయాలని చూసింది. దీంతో సదరు ప్లాట్‌ను వేములవాడ పట్టణానికి చెందిన వేడ్యాల వేణు అనే వ్యక్తి తనకు విక్రయిస్తే రూ.6 లక్షలు ఇస్తానని నమ్మబలికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. లక్ష్మికి ఇస్తానన్న డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే 2022లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఆ ప్లాట్‌ను ఎల్లారెడ్డిపేట మండలంకు చెందిన ఓ వ్యక్తికి అమ్మినట్లు తెలువగా పెద్ద మనుషులతో మాట్లాడి రూ. 8.50 లక్షలు ఇస్తానని ఒప్పుకుని ఒక లక్ష మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో తిడుతూ చంపుతానని బెదిరించడంతో లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయగా జిల్లా ఎస్పీ విచారణ చేసి నేరం రుజువు కావడంతో వేణును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతే కాకుండా అతనిపై గతంలో వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో, కరీంనగర్ వన్ టౌన్, టూ టౌన్‌లలో పలు చీటింగ్ కేసులు నమోదు నమోదయ్యాయని, బెదిరింపుల కేసులు, భూ సమస్యల్లో తలదూర్చి సెటిల్‌మెంట్ చేయడం వంటి కేసులతో పాటు అటెంప్ట్ మర్డర్ కేసులు ఉన్నాయని, ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండడానికి రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 10: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మయ్య(60) ఈనెల 9న సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా బుధవారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. లక్ష్మయ్యను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఇరు కుల్లలో 2002లో సాదాబైనామా కాగితం ఒప్పందంతో ఇరుకుల్లకు చెందిన బుర్ర ఓదయ్య వద్ద 4 గుంటల భూమిని 8 లక్షల రూపాయలు ఇచ్చి కొనుగోలు చేయగా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు విక్రయదారు మళ్లీ రెండు లక్షలు డిమాండ్ చేయటంతో పాటు దూషించాడని మనస్థాపం చెంది తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కూతురు స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నలుగురిపై వీధి కుక్కల దాడి

సుభాష్‌నగర్, జూలై 10: కరీంనగర్ గంజ్ సమీపంలోని ఓ స్కూల్ దగ్గర వీధి కుక్కలు ముగ్గురు చిన్నారులు, వృద్ధురాలిపై దాడి చేశాయి. అక్కడే ఉన్న స్థానికులు గమనించి కుక్కలను వెళ్లకొట్టారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ ధర్నా

హుజూరాబాద్, జూలై 10: కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరుతూ బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో పార్లమెంట్‌లో ఆమోదించుకున్న నాలుగు లేబర్ కోడ్‌లను, బొగ్గు బ్లాక్‌ల వేలంను రద్దు చేయడంతో పాటు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలన్నారు. నాయకులు అజ్జు, సరోజన, రాజ్‌కుమార్, నర్సయ్య, సులోచన, రాజేశ్వరి, లత, పుష్పలత పాల్గొన్నారు.

నేషనల్ హైవే వాహనాల ద్వారా జరిగే ప్రమాదాలే ఎక్కువ

శంకరపట్నం, జూలై 10: హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలో ఫోర్‌లైన్ జాతీయ రహదారికి మట్టి తరలిస్తున్న వాహనాల ద్వారానే ప్రమాదాలు ఎక్కువ జరిగాయని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. బుధవారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో రోడ్డు భద్రతా నియమాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవర్లు ఓవర్ లోడ్, అధిక స్పీడ్‌తో వెళ్లడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల తీరును చూసి జడ్జి దిగ్భ్రాంతికి లోనయ్యారని సందర్భాన్ని గుర్తు చేశారు. ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని జడ్జి సూచించారన్నారు.

ఓపీఎస్ అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

● సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, జూలై 10: ప్రభుత్వ ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవితంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవకుండా ఉద్యోగ సేవలకు ప్రతిఫలంగా, సామాజిక భద్రత కల్పించేందుకు పెన్షన్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, తదనుగుణంగా సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ విధానం అమలుకు ప్రభుత్వం చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో ఓల్డ్ పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం తెరపైకి తెచ్చారని, తెలంగాణ ప్రాంత ఉద్యోగులు ఓపీఎస్ అమలుకు దశాబ్ధాలుగా పోరాటం చేసినా గత ప్రభుత్వం ఎలాంటి పరిష్కారానికి చొరవ చూపలేదన్నారు. సీపీఎస్ విధానంలో ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసినప్పుడు పెన్షన్ పొందే అవకాశం లేకపోవడంతో అవసాన దశలో సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి పౌరునికి పెన్షన్ ఇవ్వాలనే ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న విధంగా ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను పరిగణలోకి తీసుకొని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో సైతం పేర్కొన్నట్లుగా కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీం విధానం అమలు చేసేందుకు పూర్తిస్థాయిలో అధ్యయనం చేపట్టాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు సామాజిక భద్రత అందించడంతో పాటు ఆత్మగౌరవంతో జీవించ గలిగే పరిస్థితులు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని వారి సమస్యలు పరిష్కరిస్తుందన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

● నిరుపయోగంగా వ్యవసాయ శాఖ, స్త్రీశక్తి భవనాలు ● వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు



మరమ్మతులకు నోచుకోని వ్యవసాయ శాఖ భవనం



నిరుపయోగంగా ఉన్న స్త్రీశక్తి భవనం

కథలాపూర్, జూలై 10: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు పనికి రాకుండా పోతున్నాయి. అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడంతో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తారు. అయితే ప్రజలకు అనువుగా ఉండడమే కాకుండా సిబ్బందికి అనుకూలంగా ఉండే విధంగా నిర్మించాల్సి ఉండగా దాన్ని విస్మరించారనే చర్చ జరుగుతోంది.

మహిళా స్వశక్తి భవనం ఉపాధి హామీ పథకం కింద వెచ్చించిన సుమారు రూ.26 లక్షలతో ఆరేళ్ల క్రితం నిర్మించారు. అధికారులు, సిబ్బంది కోసం మూడు గదులు, సమావేశాల నిమిత్తం ప్రత్యేకంగా గది నిర్మించారు. అయితే ఆ సమయంలో ఇరుకుగా ఉన్న దర్వాజలు పెట్టడం వల్ల బెంచీలు, కుర్చీలు, టేబుళ్లు కార్యాలయంలోకి తీసుకువెళ్లడానికి వీలు లేని పరిస్థితి ఉంది. దీంతో ప్రస్తుతం ఉన్న కార్యాలయాలన్ని నూతన భవనంలోకి మార్చడానికి వీలు లేని దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతినడం వల్ల కనీసం సమావేశాలు ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొత్త భవనం నిర్మించినా ఫలితం లేకుండా మారింది. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది కోసం నిర్మించిన భవనం తలుపులు ఊడిపోయి, ఫ్లోరింగ్ చెడిపోవడం వల్ల కొంత కాలంగా భవనం తెరుచుకోవడమే లేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారి కార్యాలయం లేక ఇటు సిబ్బంది, అటు రైతులు అవస్థలు పడుతున్నారు. భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తేనే అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం

నరహరి, సెర్ప్ ఏపీఎం



స్త్రీశక్తి భవనం పూర్తి చేసినప్పటికీ తమకు అందుబాటులోకి రావడం లేదు. దర్వాజాలు ఇరుకుగా నిర్మించినందువల్ల కనీసం కుర్చీలు కూడా భవ నంలోకి తీసుకెళ్లలేని పరిస్థితి. ఫ్లోరింగ్ పూర్తిగా ధ్వంసమైంది. మహిళలతో సమావేశాలు కూడా నిర్వహించడానికి వీలు లేదు. కొత్త భవనమే అయినా తాము వినియోగించుకోలేక పోతున్నాం. మరమ్మతులు చేయించాలని ఏపీడీతో చర్చించాం.ఇంజినీర్‌తో అంచనాలు వేయించి ఉన్నతాధికారులకు నివేదించనున్నాం.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు మరమ్మతులు నిలిపివేత

● ఆర్అండ్‌బీ అధికారుల నివేదిక కోరిన కలెక్టర్

హుజూరాబాద్, జూలై 10: హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వాస్తు పేరిట అనాధికారికంగా మరమ్మతులు చేస్తుండగా బుధవారం పనులను ఆర్అండ్‌బీ అధికారులు నిలుపుదల చేసినట్లు తెలిసింది. ఈ ఎమ్మెల్యే క్యాంపు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనం వాస్తు ప్రకారం లేదనే కారణంతో పోర్టికో, కిటికీలు, తలుపులను, గోడలను తొలగిస్తున్న విషయం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో పాటు స్థానిక కాంగ్రెస్, బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే పనులను నిలుపుదల చేసి నివేదిక అందించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ పనులు నిలిపివేయడంపై హుజూరాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది.

● ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు నేరేళ్ల మహేందర్‌గౌడ్, బీజేపీ నాయ కుడు బింగి కరుణాకర్‌లు బుధవారం ఆర్డీవో, ఏసీపీలకు ఫిర్యాదు చేశారు.

యువతి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 10: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన రంగం పూజిత (19) అనే యువతి మంగళవారం ఉరి వేసుకొని మృతి చెందగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు పూజిత సంవత్సర కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డుకు చున్నీతో ఉరి వేసుకొని మంగళవారం మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అటవీ గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

వీర్నపల్లి, జూలై 10: అటవీ గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నివసించేందుకు పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. వీర్నపల్లి మండలంలోని జవహర్‌లాల్ నాయక్ తండా, సీతారాం నాయక్ తండా, బండ తండాతోపాటు ఆయా తండాల ప్రధాన రహదారి వెంట ఎల్లారెడ్డిపేట సర్కిల్ పోలీసులు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు ఎదురైతే పోలీసులను సంప్రదించాలన్నారు. గంభీరావుపేట ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట హెడ్‌కానిస్టేబుల్ పాషా పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్ఆర్ఎస్‌పీ ప్రాజెక్టులోకి 1,852 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు ప్రస్తుతం 12.324 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.964 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1 నుంచి ప్రాజెక్టులోకి 6.418 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

ముగిసిన ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్

● బ్యాడ్మింటన్‌లో విజేత రామగుండం జట్టు

జ్యోతినగర్, జూలై 10: రామగుండం ఎన్టీపీసీలో జరిగిన ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్(ఎస్ఆర్ఎస్ఎం) 2024లో బ్యాడ్మింటన్ విభాగంలో రామగుండం ఎన్టీపీసీ మహిళలు, క్రికెట్‌లో సింహాద్రి ఎన్టీపీసీ పురుషుల జట్లు చాంపియన్లుగా నిలిచాయి. నాలుగు రోజులుగా జరుగుతున్న ఎస్ఆర్ఎస్ఎం బుధవారం ముగిసింది. ఎన్టీపీసీ పీటీఎస్‌లోని స్పందన ఇండోర్ స్టేడియంలో జరిగిన మహిళల బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలో రామగుండం జట్టు సింహాద్రి(విశాఖపట్నం) జట్టుపై విజయం సాధించింది. అలాగే మహాత్మాగాంధీ స్టేడియంలో రామగుండం, సింహాద్రి జట్ల మధ్య ఫైనల్ పోరులో సింహాద్రి ఎన్టీపీసీ గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన రామగుండం ఎన్టీపీసీ జట్టు 90 పరుగులకే ఆలౌట్ అయింది. 91 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన సింహాద్రి ఎన్టీపీసీ జట్టు 16 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అనంతరం జరిగిన స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఎన్టీపీసీ ఆర్ఈడీ(సౌత్) ప్రేం ప్రకాష్ ముఖ్య అతిధిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అలాగే ప్రతిభ కనబర్చిన ప్లేయర్లకు బహుమతులను అందజేశారు. నాలుగు రోజులపాటు జరిగిన పోటీలలో రామగుండం, సింహాద్రి, కుడిగి(కర్నాటక), వల్లూర్(తమిళనాడు), ఎస్ఆర్‌హెచ్‌క్యూ హైదరాబాద్ ఎన్టీపీసీ జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆర్ఈడీ ప్రేం ప్రకాష్ ప్రసంగిస్తూ ఎన్టీపీసీ ఉద్యోగులు క్రీడలపట్ల ఆసక్తి కనబర్చాలని, నిత్యం వ్యాయామం, నడక కొనసాగించాలన్నారు. ప్రధానంగా క్రీడలతో శారీరక, మానసిక ధృడత్వం కలుగుతుందన్నారు. రానున్న కాలంలో ఎస్ఆర్ఎస్ఎం పోటీలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం, తెలంగాణ ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు, ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, ఎస్ఆర్‌హెచ్‌క్యూ సీజీఎం(హెచ్ఆర్) పాణిగ్రహి, ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్ తివారి, భానేశ్వర్, హెచ్ఆర్ ఏజీఎం సిక్దర్, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ విజేత రామగుండం ఎన్టీపీసీ జట్టు

సెప్టింక్ ట్యాంకులో పడ్డ బాలుడి మృతి

పెద్దపల్లిటౌన్, జూలై 10: పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం సెప్టింక్ ట్యాంకులో పడి అస్వస్థతకు గురైన బాలుడు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన మహబూబ్‌నగర్‌కు చెందిన రాములమ్మ శ్రీనివాసుల కొడుకు జాన్‌వెస్లీ (7) మంగళవారం సెప్టిక్ ట్యాంక్‌లో పడి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నిర్లక్ష్యం వల్ల బాలుడు మృతి చెందాడని మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాలుడి కుటుంబీకులు కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జూలై 10: ధర్మారం గ్రామానికి చెందిన అతికెం శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడగా తీవ్రగాయాలయ్యాయి. బుధవారం ఉదయం కళ్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా మోకు జారి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయాలు తోటి గౌడ కులస్థులు హుటాహుటిన చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



హన్మంతు (ఫైల్)

మానకొండూర్, జూలై 10 : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ గ్రామానికి చెందిన మోదుంపల్లి హన్మంతు (56) అనే వ్యక్తి బుధవారం తన ఇంటి సమీపంలోని కరీంనగర్- జమ్మికుంట ప్రధాన రహదారిపై నుంచి బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో హన్మంతుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య లస్మమ్మ, కుమారుడు గోపి ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 10: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. పదిహేను రోజుల క్రితం పత్తి ధర రూ.7,300 పలికింది. క్రమేపీ పెరుగుతూ వస్తూ ప్రస్తూతం రూ.7600 చేరుకుంది. బుధవారం మార్కెట్ యార్డుకు 17మంది రైతులు 293క్వింటాళ్ల విడి పత్తిని విక్రయానికి తీసుకు వచ్చారు. బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7600, కనిష్ఠ ధర రూ.7400 చెల్లించి ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

చెరువు ఆక్రమణపై అధికారుల విచారణ

మల్యాల, జూలై 10: మల్యాలలోని పలు చెరువులు ఆక్రమణకు గురి అవుతుండడంతో అధికారులు బుధవారం పరిశీలించి పలు ఫిర్యాదులపై విచారణ జరిపారు. మల్యాలలోని చెరువులు ఆక్రమణకు గురి అవుతున్నాయని కాపాడి తమ జీవనోపాధి కోల్పోకుండా చర్యలు తీసుకోవాలంటూ స్థానిక గంగపుత్ర సంఘం సభ్యులు నెల రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులో మట్టి నింపుతుండడంతో విస్తీర్ణం తగ్గడమే కాకుండా చేపల పెంపకానికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు మల్యాలలోని సూరప్ప, మత్తడి చెరువులను పరిశీలించారు. చెరువుల వద్ద మట్టి నింపుతున్నట్లు అధికారుల విచారణలో తేలడంతో చర్యల కోసం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణ జరిపిన వారిలో డీఈ తిరుపతి, ఆర్ఐ తిరుపతి, గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ఓదెల, జూలై 10 : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని రైలు ఢీకొని శ్రీరామోజు స్వస్తిక్ అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. మండలంలోని కనగర్తికి చెందిన స్వస్తిక్ మధ్యాహ్నం ఓదెలకు వచ్చినట్లు సమాచారం. సాయంత్రం వేళల్లో రైల్వే స్టేషన్ వైపు వెళ్లిన వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ముఖం నుజ్జునుజ్జు అయ్యింది. కొన ఊపిరితో ఉన్న స్వస్తిక్‌ను 108 అంబులెన్స్ ద్వారా కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉంది.

హాస్టల్స్, హోటల్స్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

ధర్మపురి, జూలై 10: ధర్మపురి పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ స్కూల్‌లో నాసిరకంగా ఉన్న చెడిపోయిప కూరగాయలను బయట పడవేయించారు. అలాగే ఫాస్ట్ ఫుడ్ సెంటర్, హోటల్స్ బేకరీలను కూడ తనిఖీ జరిమానాలు విధించారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అన్నదానం, ప్రసాద విక్రయశాలను పరిశీలించి ప్రసాదాలను టెస్టింగ్ కోసం ఆమె వెంట తీసుకెళ్లారు. ప్రతీ ఒక్కరు నాణ్యత ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎస్ఆర్‌టీ అధికారి

కొడిమ్యాల, జూలై 10 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలను బుధవారం స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రేనింగ్(ఎస్ఆర్‌టీ) అధికారి భరణి ఆకస్మికంగా సందర్శించారు. మోడల్ స్కూల్‌లో పరిశుభ్రత, బోధన విధానం, మధ్యాహ్న భోజనం, క్రీడా మైదానం, వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన పలు అంశాలను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చేస్తున్న బోధన తీరును ప్రత్యక్షంగా పరిశీలించి అభినందించారు. ఈ సందర్శనలో ప్రిన్సిపాల్ బి లావణ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై 10: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్ www.tgbc-studycircle.cgg.gov.inలో ఈ నెల19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ ఈ నెల22న మొదలవుతుందన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5000 ఉపకార వేతనం అందజేస్తామన్నారు. ఉచిత శిక్షణ హైదరాబాద్ సైదాబాద్‌లోని టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లలో అందజేస్తారన్నారు. మరింత సమాచారం కోసం 040-24071178 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి గాయాలు

శంకరపట్నం, జూలై 10: శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో కారు ఢీకొన్న ఘటనలో బుధవారం మతిస్థిమితం లేని వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ సొసైటీ గోదాం సమీపంలో అదే గ్రామానికి చెందిన నక్క గట్టయ్య అనే మతిస్థిమితం లేని వ్యక్తిని కారు ఢీకొట్టిందన్నారు. తీవ్ర గాయాలైన గట్టయ్యను స్థానికుల ఆస్పత్రికి తరలించారు.

నా పిల్లలన్నాడు.. మొహం చాటేశాడు

● జైలు జీవితం అనుభవించి సత్ప్రవర్తన కింద బయటకు ● పిల్లలను వదిలేసి వెళ్లిన తండ్రి

జమ్మికుంట/జమ్మికుంట రూరల్, జూలై 10: భార్య మృతి చెందిన కేసులో పద్నాలుగేళ్ల జైలు జీవితం అనుభవించిన ఓ తండ్రి ఆనాధాశ్రమంలో ఉన్న తన పిల్లల వద్దకు వచ్చాడు. ఇన్నాళ్లు పిల్లలకు దూరం అయ్యానని, నా అన్నవారు తెలియకుండా పెరిగారని, ఇకపై తన వద్ద పెట్టుకుంటానని, వారికి ఏ లోటు రాకుండా చూసుకుంటానని కల్లబొల్లి మాటలు చెప్పి వెంట తీసుకు వెళ్లాడు. రెండు రోజులు గడువక ముందే హైదరాబాద్ చెక్కేశాడు.

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామ సారయ్య సత్తెమ్మ దంపతులకు కుమార్తె పూజ, కుమారుడు బన్ని ఉన్నారు. కుటుంబ కలహాలతో తీవ్ర కోపోద్రిక్తుడైన సారయ్య భార్య సత్తెమ్మ ను వెనక్కి నెట్టడంతో మృత్యువాత పడింది. ఈ సంఘటన 2010సంవత్స రంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో సారయ్యకు జీవిత ఖైదు పడింది. ఆ సమయంలో పూజ 5సంవత్సరాలు, బన్ని 4సంవత్సరాలు ఉన్నారు. పోలీ స్‌ల సహకారంతో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల స్పందన ఆనాధాశ్రమంలో పిల్లలను చేర్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3న సత్ప్రవర్తన కింద సారయ్యను విడుదల చేయగా నేరుగా ఆనాధాశ్రమంకు చేరుకున్నాడు. ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలో ఇళ్ల అద్దెకు తీసుకున్నానని, పిల్లలను కూడా తన వెంట ఉంచుకుంటానని, ఇకపై వారికి ఏ లోటు రానివ్వనని కల్లబొల్లి మాటలు చెప్పి ఆశ్రమం నిర్వాహకుడిని నమ్మించాడు. ఈ నెల 4న పూజ, బన్నిలను తీసుకెళ్లాడు. మరుసటి రోజు హైదరాబాద్ వెళ్లొస్తానని, జైలు అకౌంటెంట్ ఫోన్ చేశాడని, మనకు డబ్బు లు వచ్చేవి ఉన్నాయని, తీసుకువస్తానని చెప్పి తెల్లవారు జామున 5గం టలకు ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం 5గంటలకు ఫోన్ చేసి మీరు నా పిల్లలు కాదు, నాకు పుట్టలేదు, సర్టిఫికెట్లపై నా పేరు తీసివేయాలని, తాను మరో వివాహం చేసుకుంటున్నాని, నా పేరిట ఉన్న కొద్దో గొప్పో ఆస్తిని వారి కే ఇచ్చేస్తానని చెప్పి అతనిలో ఉన్న కసాయి తనాన్ని నిరూపించుకున్నాడు. ఒక్కసారి షాక్ గురైన పూజ, బన్నిలు కన్నీంటి పర్యాంతమై తనను చేరదీసిన ఆశ్రమం బాటపట్టారు. వారిని చూసి చలించిన ఆశ్రమం నిర్వాహకుడు గోపరాజు వీరస్వామి దగ్గరకు తీసుకుని ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నాడు. మీకు నేను ఉన్నా, మీరు అధైర్యపడద్దని ధైర్యం చెప్పి లోనికి తీసుకువెళ్లి భోజనం పెట్టాడు. వారి తండ్రి చేసిన పని తెలు సుకున్న తోటి పిల్లలు కోపంతో రగిలి పోయారు.



ఆశ్రమానికి వచ్చిన పూజ, బన్ని

రామడుగు ఎస్ఐతో ప్రాణహాని

●వెలిచాలకు చెందిన కుతాడి కనకయ్య ఆరోపణ

సుభాష్‌నగర్, జూలై 10: రామడుగు ఎస్ఐతో తనకు ప్రాణహాని ఉందని వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్య, అతడి భార్య అనిత తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో కుతాడి కనకయ్య మాట్లాడుతూ దొంగతనం విషయంలో తప్పుడు ఫిర్యాదు చేయడంతో ఎలాంటి విచారణ చేయకుండా పోలీసులు తనను కొట్టి కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఏప్రిల్‌లో జరిగిన గొర్రెల దొంగతనం కేసులో తనను అన్యాయంగా ఇరికించారని, నేరాన్ని ఒప్పుకోవాలని చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. జూన్ 11న ఇంట్లో నిద్రిస్తున్న తనను తెల్లవారుజామున 4గంటలకు రామడుగు పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విపరీతంగా కొట్టారని ఆరోపించాడు. అదేరోజు కరీంనగర్‌కు తరలించి మళ్లీ కొట్టారని, లేవలేని స్థితిలో ఉన్న తనను జూన్ 12న రాత్రి 10 గంటలకు ఇంటికి పంపించారని తెలిపారు. 8 మంది కానిస్టేబుల్స్, ఒక ఎస్ఐ కలిసి తనను విపరీతంగా కొట్టారని ఆరోపించారు. ఎస్ఐపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కుతాడి కనకయ్య కోరాడు. అనంతరం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో విచారణ పేరుతో చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.నాగరాణి, పుష్పలత, రాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, జూలై 10: శంకరపట్నం మండలం మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద బుధవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సైదాపూర్ మండలంలోని బూడిదపల్లి గ్రామానికి చెందిన పడాల వెంకటస్వామి తన భార్య రాజేశ్వరితో కలిసి మొలంగూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో మొలంగూర్ గ్రామానికి చెందిన తడిగొప్పుల సంపత్ ఎదురుగా వస్తున్నాడు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో పడాల వెంకటస్వామికి, సంపత్‌లకు స్వల్పగాయాలు కాగా 108వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 10: కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తిలో కరీంనగర్ రూరల్ పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని పోలీసు ఠాణాకు తరలించి కేసు నమోదు చేశారు. కాగా గ్రామంలో భారీగా ఇసుకను నిలువ చేసినట్లుగా మైనింగ్, పోలీసుల తనిఖీల్లో వెల్లడైంది.

చోరీ కేసులో 8 నెలల జైలు శిక్ష

చిగురుమామిడి, జూలై 10: మండలంలో కొండాపూర్ గ్రామంలో గత సంవత్సరం నవంబరు 8 తేదీన ఇదే గ్రామానికి చెందిన దరిపల్లి లచ్చవ్వ అనే వృద్ధురాలిని మోసం చేసి పర్వతం రాజు అనే వ్యక్తి బంగారు అభరణాలు దొంగిలించిన కేసులో 8 నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్సై బండి రాజేశ్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్యాస్ స్టౌవ్ రిపేర్ చేస్తానని చెప్పి పర్వతం రాజు అనే వ్యక్తి ఆమె ఒంటిపై ఉన్న కమ్మలు, ఇతర బంగారు వస్తువులను దొంగలించి పారిపోయాడు. దీనిపై కేసు నమోదు అయింది. దీనిపై ఎక్సైజ్ శాఖ కోర్టు నేరస్తునికి ఎనమిది నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయాల జరిమానా విధించినట్లు తెలిపారు. ఇప్పటికైనా గ్రామాల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు వస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలని తెలిపారు.

పీహెచ్‌సీ ఏర్పాటు ఎప్పుడో?

● మంజూరైనా స్థల సేకరణలో జాప్యం ● పొంచిఉన్న వ్యాధుల ముప్పు

గన్నేరువరం, జులై 10: గన్నేరువరం మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం పక్క మండలమైన తిమ్మాపూర్, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. తిమ్మాపూర్‌కు 30 కిలోమీటర్లు, జిల్లా ఆసుపత్రికి 40 కిలోమీటర్ల దూరం వెళ్ళవలిసి వస్తుంది. అత్యవసర సమయాల్లో దూరభారంతో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. సాధారణ పరీక్షలకు వెళ్లే గర్భిణీలు పీఎచ్‌సీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో గన్నేరువరం, ఖాసింపేట, జంగపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా వీటిని పల్లె దవాఖానాలుగా మార్చారు. వీటిలో గన్నేరువరం, జంగపల్లి సబ్‌సెంటర్ లకు ఎంఎల్‌ఎచ్‌పీలుగా ఉపేందర్, సాహితి డాక్టర్లను నియమించారు. మిగతా రెండు సబ్ సెంటర్‌లలో డాక్టర్లు లేక ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్‌లు ఉండగా ప్రస్తుతం వారు ఇరువురు వేరే మండలానికి బదిలీ కాగా మండలానికి హెల్త్ అసిస్టెంట్ లేకపోవడంతో ఏఎన్ఎంలపై భారం పడింది. ప్రస్తుతం తిమ్మాపూర్ పీఎచ్‌సీ డాక్టర్ ప్రణవ్ మండలానికి ఇంచార్జిగా ఉన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై, పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి సైతం సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పీహెచ్‌సీ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి(ఫైల్)

స్థల సేకరణపై స్పష్టత కరువు

మండలానికి పీఎచ్‌సీ మంజూరుకావడంతో గత సంవత్సరం నవంబర్‌లో పీఎచ్‌సీ నిర్మాణం కోసం ఖాసింపేట చౌరస్తా వద్ద స్థలాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల అధికారులతో కలిసి పరిశీలించారు. అట్టి స్థలంలో పీహెచ్‌సీ నిర్మిస్తే మండలంలోని వివిధ గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని ప్రజాప్రతినిధులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. నేటి వరకు పీహెచ్‌సీ నిర్మాణంపై ఎలాంటి స్పష్టత రాలేదు.

స్కైలాబ్ @ 45ఏళ్లు

చొప్పదండి,జూలై10: స్కైలాబ్‌కు నేటితో 45ఏళ్లు నిండాయి. 1979 జూన్, జూలై నెలలో పైనుంచి ఏదో పడుతుందని ఇక బతుకలేమంటూ అంతటా ప్రచారం జరిగింది. ఇక చనిపోతామంటూ ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారు. స్కైలాబ్ అనే ఉపగ్రహం ఆకాశంలో గతి తప్పిందని భూమిపై కూలి పోతుందని శాస్త్రవేత్తలు ప్రకటించగా ప్రజల్లో భయాందోళనలు పెరిగిపోయాయి. ఇక బతుకలేమంటూ కొంతమంది విలువైన సంపదను విక్రయించుకొని విందులు చేసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోనే స్కైలాబ్ పడుతుందని వదంతులు వ్యాపించాయి. 1979 జూలై 11న స్కైలాబ్ ఉపగ్రహాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో సముద్రంలో దింపామని రేడియోలో వార్తలు రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విందులు చేసుకున్నారు. ప్రజలందరూ స్కైలాబ్ పడ్డరోజున గడగడలాడిపోయారు. అయితే ఆ రోజు కొందరికి తీపిగుర్తుగా మిగిలిపోయింది.అప్పుడు పుట్టిన వారికి గ్రామాలలో స్కైలాబ్‌గా పేరు పెట్టుకున్నారు.

పేరులోనే ప్రత్యేకత

కందుల స్కైలాబ్ గౌడ్, మంగళపల్లి



స్కైలాబ్ పడ్డరోజు పుట్టడంతో తల్లిదండ్రులు స్కైలాబ్ గౌడ్‌గా నామకరణం చేశారు. అందరి కన్నా తన పేరులో ప్రత్యేకత కలిగి ఉండడం సంతోషంగా ఉంది. నేను పుట్టిన రోజున దేశమంతా గడగడలాడిపోయి అంతా ఊపిరిపీల్చుకోవడం గర్వకారణంగా ఉంది,

యావర్ రోడ్డు అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి హామీ

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి



సీఎం రేవంత్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా యావర్ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీనిచ్చారని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి తెలిపారు. బుధవారం హైద్రాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాలలో మాస్టర్ ప్లాన్ అభివృద్ధికి రూ. వంద కోట్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా నూకపల్లి వద్ద అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు సైతం నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. 2008-2009 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని సుమారు 4000 మంది నిరుపేదలకు వ్యక్తిగత ఇళ్లు మంజూరు చేయగా, సుమారు 1,600 ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. యావర్ రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం అందించడానికి, రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే



మంత్రి ఉత్తమ్‌తో ఎమ్మెల్యే

జగిత్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల శాఖ, సివిల్ సప్లయి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ బుధవారం కలిశారు. హైద్రాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జగిత్యాల నియోజకవర్గంలో ఇరిగేషన్ అభివృద్ధికి సహాయ సహకారాలను అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు.

బోనాల పండుగ పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బూసి లక్ష్మీనారాయణ గార్డెన్స్‌లో ఈనెల 12వ తేదీన మేదిని లలితా కళా క్షేత్రం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ బోనాల పండుగ పోస్టర్లను నాట్య సామ్రాట్ బొమ్మిడి నరేశ్‌కుమార్, పలువురు కళాకారులు, కళాభిమానులు ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని విద్యానగర్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో బోనాల పండుగ పోస్టర్లను ఆవిష్కరించారు. బోనాల పండుగలో భాగంగా బోనాల నృత్యం, గ్రూప్ నృత్యాలు, సినీ, జానపద పాటలు, కూచిపూడి నృత్యం, పేరిణి నృత్యం, భరత నాట్యం, జానపద నృత్యం, సినిమా నృత్యం తదితర కార్యక్రమాలను జరుగుతాయని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో సీతారామా దేవాలయ కమిటీ నాయకులు అశోక్‌రావు, చిరంజీవి, వెంట్రావు, మేదిని లలితా క్షేత్రం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విషజ్వరంతో పోసానిపేట విద్యార్థి మృతి



దీకొండ శివతేజ (ఫైల్)

కథలాపూర్, జూలై 10: మండలంలోని పోసానిపేటకు చెందిన దీకొండ శివతేజ (23) అనే విద్యార్థి బుధవారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం... శివతేజ హైదరాబాద్‌లో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వారం రోజుల కిందట ఆరోగ్యం బాగా లేదని ఇంటికి వచ్చాడు. కోరుట్లలోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని పరీక్షలు ఉండ డంతో మళ్లీ కాలేజీకి వెళ్లిపోయాడు. జ్వరం తీవ్రం కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్ళాడు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు హైదరాబాద్ తరలించాలని సూచించారు. దీంతో అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. విద్యార్థి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

మహానంది జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

రాయికల్, జూలై 10: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన గనవేని మల్లేష్ యాదవ్ యూత్ డెవలప్‌మెంట్, సామాజిక సేవా రంగంలో మహానంది జాతీయ అవార్డును అందుకున్నాడు. జగిత్యాల జిల్లావ్యాప్తంగా ఆపదలో ఉన్న కుటుంబాలను తనవంతుగా ఆదుకుంటూ యువకులు ఆర్థికంగా, స్వతాహాగా ఎదిగేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సులు నిర్వహించి పలు రకాల సేవలు అందించినందుకుగాను ఈ అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్‌ను ఇటిక్యాల బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెల్మల ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ రాయికల్ మండల మాజీ చైర్మన్ కొల్లూరి వేణు, మాజీ సర్పంచ్ మరిపెల్లి నారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ పోతవేణి రాజేందర్ గౌడ్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు రొట్టె శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

రాయికల్, జూలై 10: రాష్ట్రంలో 15 సంవత్సరాలుగా సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ పేస్కేలు అమలు చేస్తూ, రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ జగిత్యాల జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి కుడుకల రవీందర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సలహాదారు వేం నరేందర్ రెడ్డికి బుధవారం హైదరాబాద్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న జిల్లా, మండల, స్కూల్ కాంప్లెక్స్, పాఠశాల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ కనీస వేతనం విధానం అమలు, రెగ్యులరైజేషన్ చేసే విధంగా, విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించే డిమాండ్లతో పోరాటం చేస్తున్న నేపథ్యంలో వారి డిమాండ్లను నెరవేర్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు చర్యలకు ఆదేశించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖను అందజేశారు.

ఆకట్టుకున్న మానస స్కూల్ ఆరంభ్-2024

జగిత్యాల అర్బన్, జూలై 10: పట్టణంలోని స్థానిక మానస స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పాఠశాల నూతన విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను ఆరంభ్-2024 పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులచే ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పిస్తూ వారిని ప్రోత్సహించడంలో తమ పాఠశాల ఎల్లవేళలా ముందుంటుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



చిట్టాపూర్‌లో వరి వెదజల్లే సాగును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

కోరుట్ల రూరల్, జూలై 10: రైతులకు ప్రయోజకరమైన పంట సాగులపై అవగాహన కల్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ వ్యవసాయ అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పంటల సాగుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించి జాగ్రత్తలను వివరించాలని సూచించారు. మొదట నియోజకవర్గ పంట సాగు వివరాలను అధికారులు వివరించారు. వరితో పాటు సాగుచేస్తున్న ఇతర పంటల వివరాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే రైతులకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల వ్యవసాయ అధికారు లు, మాజీ ప్రజాప్రతినిదులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● **ఎరువుల నిల్వల రికార్డులు సక్రమంగా నిర్వహించాలి**

కోరుట్ల రూరల్: ఎరువుల నిల్వల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారిణి నాగమణి సింగిల్ విండో కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండలంలోని ఏకీన్‌పూర్, పైడిమడుగు, జోగినిపల్లి, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లోని సింగిల్ విండో ఆధ్వర్యంలో ఉన్న గోదాంల్లో యూరియా కాంప్లెక్స్ ఎరువులు నిల్వలను పరిశీలించి ఈ-పాస్ యంత్రాలను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు ఎరువులు పంపిణీ చేయాలని అన్నారు. రైతులకు ఎరువులు అందించిన తర్వాత వాటి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుచాలని సూచించారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, జగన్‌మోహన్‌రావు, బండి భూమయ్య, ఆదిరెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో కూలీల ఖర్చులు తగ్గుతాయి..

మల్లాపూర్: రైతులు వెదజల్లే పద్ధతితో వరి సాగు చేయడంతో కూలీల ఖర్చులు తగ్గుతాయని జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. బుధవారం మండలంలోని చిట్టాపూర్ గ్రామశివారులోని రైతు వరిక్షేత్రంలో వెదజల్లే పద్ధతితో సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెదజల్లే పద్ధతి ద్వారా ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనం సరిపోతుందన్నారు. ఈ పద్ధతిలో సాగుచేస్తున్న రైతులు అవలంబించే మెలకువలు, సస్యరక్షణ చర్యలను వివరించారు. వెదజల్లే పద్ధతి ద్వారా రైతులకు సాగు ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఆమె వెంట వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈవో శ్రీహరి, రైతులు, తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

కొడిమ్యాల, జూలై 10: మండలంలోని పూడూర్ నుంచి దొంగలమర్రి బస్ స్టేజీ మధ్య దారిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి మృతి చెందినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు. కొడిమ్యాల పోలీసులు మృతదేహాన్ని జగిత్యాల ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాలిసి ఉందన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే కొడిమ్యాల ఎస్సై 8712656831, మల్యాల సీఐ 8712656818 నంబర్లకు సమాచారం అందించాలని కొడిమ్యాల ఎస్సై తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ధర్మపురి, జూలై 10: ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో ఏడవ వార్డు కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి-రాజేష్ ఆధ్వర్యంలో ఈ నెల 12న శుక్రవారం కరీంనగర్ సన్‌షైన్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జనరల్ ఫిజీషియన్, న్యూరో ఫిజీషియన్, కార్డియోలాజిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని వివరించారు. బీపీ, జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2 డీఈకో పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు.

చిన్నారులకు ఆర్థిక సహాయం

కొడిమ్యాల, జూలై 10: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి కిషన్‌పూజ అనే దంపతులు ఇద్దరు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో ఆరు సంవత్సరాల కుమారుడు మణిదీప్, రెండేళ్ల దివ్యశ్రీ అనాదలైనారు. బుధవారం అనాధలైన చిన్నారులకు బీజేపీ మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి ఐదు వేల రూపాయల నగదును అందించారు.

అద్దె బస్సు డ్రైవర్లకు ప్రాధాన్యం కల్పించాలి

కోరుట్ల, జూలై 10: ఆర్టీసీలో అద్దె బస్సులు నడుపుతున్న డ్రైవర్లకు ఆర్టీసీ ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కోరుట్ల డిపో అవరణలో అద్దె బస్సు డ్రైవర్లు నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లుగా దాదాపు 10 సంవత్సరాలుగా పని చేస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ల నియామకం కోసం ఇస్తున్నందున తాము చేసిన సేవలను గుర్తించి తమను ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగాలను కల్పించాలని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ న్యాయం చేస్తారని నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వంకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అద్దె బస్సుల డ్రైవర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల నిరసన

కథలాపూర్, జూలై 10: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం స్కీంకు బడ్జెట్ కేటాయించాలని, ప్రైవేటీకరణ చేయవద్దని డిమాండ్ చేశారు. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షలను, నేషనల్ మానిటైజేషన్‌ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. మోకాళ్ళపై నిలుచుని నిరసన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

- సీఐ రాం నర్సింహారెడ్డి



కుమ్మరిపల్లిలో మాట్లాడుతున్న సీఐ నర్సింహారెడ్డి

వెల్గటూర్, జూలై 10: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సీఐ రాం నర్సింహారెడ్డి సూచించారు. బుధవారం కుమ్మరిపల్లి మోడల్ స్కూల్‌లో ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘుచందర్ సూచనలతో విద్యార్థులకు మత్తు పదార్థాలు, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చదువుపైనే దృష్టిపెట్టాలని కోరారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎస్సై ఉమాసాగర్, మోడల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: ప్రభుత్వాలు నూతనంగా ప్రవేశ పెట్టిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మాదాపూర్ గ్రామంలో నూతన చట్టాలపై గ్రామస్తులకు అవగావన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ సైబర్ క్రైం, గంజాయి నివారణపై గ్రామస్థలకు వివరించారు. సీసీ కేమరా ఏర్పాటుతో నేరాల నియతరణపై గ్రామస్థులకు తెలిపారు. 100 నంబర్ సేవలను వివరిస్తూ అపదలో ఉన్న వారు 100కు ఫోన్ చేస్తే తమ సమస్యలు పరిష్కాంకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామాలలో నూతన వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● **యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు..**

బుగ్గారం: యువత మత్తు పదార్థాలకు బానిసై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపులపూర్ గ్రామంలో గుడుంబా నివారణతో పాటు కొత్త చట్టాలపై బుధవారం ప్రజలకు ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాను జూలై 1వ తేదీనుంచి అమల్లోకి వచ్చాయన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న తగాదాలు ఉంటే సామరస్యంగా, శాంతియుత వాతావరణంలో ఎక్కడిక్కడే పరిష్కరించుకోవాన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవరిస్తామని అలాగే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎంతటివారైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిక్షణకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని అందుకు ప్రజల సహకరించాలని ఎస్సై శ్రీధర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి బోనాలు



నెత్తిన బోనంతో ఊరేగింపులో పాల్గొన్న చైర్‌పర్సన్

జగిత్యాల టౌన్, జూలై 10: జిల్లా కేంద్రంలోని 10వ వార్డులోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మ తల్లికి బోనాల పండుగ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి వేడుకల్లో పాల్గొని నెత్తిన బోనం ఎత్తుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీజే పాటలు, కోలాటాల మధ్య గంగమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిరికొండ భారతి, నాయకులు తుర్క రాజిరెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.

సంగెంలో తాతమ్మ బోనాలు..

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామంలో బుధవారం తాతమ్మ బోనాల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా గ్రామంలోని శాలివాహన సంఘ సభ్యుల అధ్వర్యంలో బోనాల జాతర మహోత్సవంను జరిపారు. గ్రామంలోని పురవీదుల గుండా మహిళలు బోనాల శోభాయాత్రను నిర్వహించారు. శోభాయాత్రలో పోతరాజు నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహిళలు బోనాలు తాతమ్మకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. విరివిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

కోరుట్ల, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం పట్టణంలోని 23వ వార్డులో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, గుండోజీ శ్రీనివాస్ నాయకులు పుప్పాల ప్రభాకర్, సంగ లింగం, అడెపు మధు, రాజోజీ సదనాందాచారి, మచ్చ కవిత, ఎంబేరి సత్యనారాయణ, చింత రూపలత, ఆశోక్, తెడ్డు విజయ్, బొల్లె నర్సయ్య పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న జువ్వాడి కృష్ణారావు

సరస్వతిమాత విగ్రహం అందజేత

పెగడపల్లి, జులై 10 : పెగడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి జిల్లాపరిషత్ రిటైర్డ్ సూపరింటెండెంట్ జలగం జగన్‌మోహన్‌రావు బుధవారం పంచలోహ సరస్వతీమాత విగ్రహాన్ని అందజేశారు. అనంతరం శాఖ గ్రంథాలయానికి యువతకు ఉపయోగపడే పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు లలిత, పంచాయతీకార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

పెగడపల్లి, జులై 10: తమ సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ బుధవారం మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్స్‌డేలో భాగంగా తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. పనికితగిన వేతనం, ఉద్యోగ భద్రత , పర్మినెంట్, కోర్టు తీర్పుననుసరించి పెన్షన్ పెంపు తదితర డిమాండ్లు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీసీ సాధికారత ప్రెసిడెంట్‌ను కలిసిన మున్నూరుకాపు నాయకులు

ధర్మపురి, జూలై 10: బీసీ సాధికారత సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాదినేని రాజేందర్‌ను బుధవారం పలువురు మున్నూరుకాపు సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల రాజేందర్ బీసీ సాధికారత ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోనాపూర్ పీఏసీఎస్ చైర్మన్ గురునాథం, మల్లారెడ్డి, చెదల సత్యనారాయణ, అమిరిశెట్టి మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బోనాల ఉత్సవం

జగిత్యాల అర్బన్, జూలై 10: పట్టణంలోని స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఆషాడమాస బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమ్మవారికి బోనాలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకర్షించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి తాళం తీయించిన కాంట్రాక్టర్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



తాళం తీస్తున్న సిబ్బంది

కొడిమ్యాల, జూలై 10: మండలంలోని రాంసాగర్ గ్రామపంచాయతీ భవనానికి బిల్లులు చెల్లించడం లేదని మంగళవారం కాంట్రాక్టర్ నీలగిరి గంగారావు తాళం వేశారు. బుధవారం 'పంచాయతీ కార్యాలయానికి తాళం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మినీలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జగిత్యాల డీఎల్‌పీవో కనకదుర్గ రాంసాగర్ గ్రామాన్ని సందర్శించారు. భవన నిర్మాణ కాంట్రాక్టర్ గంగారావుతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ గ్రామ సరిహద్దు ఖరారు చేయాలని, ప్రత్యేక అధికారిని మార్చాలని కోరుతూ డీఎల్‌పీవోకు వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవనం బిల్లులు చెల్లింపు విషయమై ఉన్నత అధికారులకు నివేదికను అందిస్తామని తెలిపారు. అంతకుముందు కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీ సిబ్బందితో తాళం తీయించారు. డీఎల్‌పీవో వెంట పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, ఎంపీవో వాసవి, గ్రామ కార్యదర్శి అరవింద్ ఉన్నారు.

వనమహోత్సవంలో ప్రజలను భాగస్వాములు చేయాలి

- ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ రఘువరన్



అధికారులకు సూచనలు ఇస్తున్న రఘువరన్

మెట్‌పల్లి రూరల్, జూలై 10: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ రఘువరన్ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో మండల అధికారులతో కలిసి మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం గ్రామంలో నాటిన మొక్కలు, వెల్లుల్లలోని పల్లెప్రకృతి వనాన్ని, మేడిపల్లి నర్సరీని పరిశీలించి మండల, పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో గ్రామస్థులు భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో మొక్కలు నాటే స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. వనమహోత్సవానికి సరిపడా మొక్కలు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రజలకు అవసరమైన మొక్కలు అందించి ఇంటి పరిసరాల్లోని ఖాళీ స్థలాలో నాటేలా చూడాలన్నారు. నాటిన వాటి సంరక్షణ గురించి తెలియజేయాలని ఆదేశించారు. పెరిగిన మొక్కలు నరికి వేయడం వలను ప్రకృతికి నష్టం జరుగుతుందని, గ్రామాల్లో చెట్లను నరికి వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. మొక్కలు నాటడడంతో ప్రకృతిని కాపాడినవారువుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీఎమ్ తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, నారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

గొల్లపల్లి, జూలై 10: వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా పశువుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అందులో భాగంగా ఈ సీజన్‌లో పశువులకు సోకే ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించి పశు సంపదను కాపాడుకోవాలని పశు వైద్యాధికారిణి డాక్టర్ కొక్కెర మనీషా పటేల్ పశుపోషకులకు సూచించారు. బుధవారం గొల్లపల్లి మండలం వెన్గుమట్ల గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆవులు, ఎద్దులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పశు వైద్యాధికారిణి మాట్లాడుతూ లంపి స్కిన్ డిసీజ్ (ఎల్‌సీడీ) అనేది పశువుల్లో వచ్చే అంటువ్యాధి అని పేర్కోన్నారు. ఈ వైరస్ వల్ల వైరస్ సోకిన ఒక వారం అనంతరం పశువులకు తీవ్రమైన జ్వరం వస్తుందని, వ్యాధి సోకిన పశువుల చర్మంపై అంగుళాలు ఏర్పడి వాపులు, నొప్పులతో పశువులు నడవలేని స్థితిలో బలహీనంగా అవడం, పాల ఉత్పత్తి తగ్గడం, అంధత్వం, గర్భస్రావం, కొన్ని సార్లు పశువులు మరణించే ప్రమాదం ఉంటుందని పశుపోషకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 94 మూగ జీవాలకు వ్యాధినిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి తెలిపారు. అనంతరం అవసరమున్న పశువులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సంధ్య, సబార్డినేట్ అజీజ్, పశుపోషకులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి మనీషా పటేల్